

గరుడ గమనా.. పుష్పక వాహనా..

కల్యాణ మహోత్సవాల్లో భాగంగా అంతర్వేది లక్ష్మీ నృసింహస్వామికి బుధవారం సాయంత్రం గరుడ పుష్పక వాహనం, రాత్రి పుష్పక వాహనంపై గ్రామోత్సవాలు నిర్వహించారు.




స్కూలు బస్సు ఢీకొని చిన్నారి మృతి

ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల బస్సు ఢీకొని మూడేళ్ల చిన్నారి శివకోటి సుకన్య దుర్మరణం పాలైన ఘటన తొండంగి మండలం సీతారాంపురంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

8లో

డెల్టాలకు 8,550 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,450, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.65 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

గంజాయి, జూదంపై ఉక్కుపాదం



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

పెద్దాపురం: గంజాయి, జూదాల నిర్వహణపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ ఆవరణలో పరిశుభ్రతను, వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి, ఎప్పటికప్పుడు దాడులు, తనిఖీలు చేస్తామని చెప్పారు. పండగ వాతావరణం పేరుతో మొదలైన కోడిపందాలు, పేకాట శిబిరాలపై నిఘా ఏర్పాటు చేసి, ప్రతి రోజూ దాడులు నిర్వహిస్తామని తెలిపారు. జూదాల నిర్వహణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. అనంతరం పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీహరి రాజు, సీఐ కృష్ణభగవాన్, ఎస్సై మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్లపై కానిస్టేబుళ్లకు శిక్షణ



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: డ్రోన్ల వినియోగంపై హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ప్రత్యేక శిక్షణ బుధవారం ముగిసింది. జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్పీ పర్యవేక్షించారు. త్వరలో ప్రతి స్టేషన్ పరిధిలో ఓ డ్రోన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డ్రోన్ వినియోగించి, కీలక కేసులు ఛేదిస్తే సిబ్బందిని తగిన రీతిలో సత్కరిస్తామని తెలిపారు.

పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో జరిగాయి. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎన్‌వీ ప్రసాదరావు, జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని అందరూ డీఎల్డీవోలు, ఎంపీడీవోలు పాల్గొని, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులుగా జెడ్పీ డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, జిల్లా అధ్యక్షులుగా పెద్దాపురం ఎంపీడీవో డి.శ్రీలలిత, ఉపాధ్యక్షులుగా తుని ఎంపీడీవో కె.సాయినవీన్, డ్వామా ఏపీడీ పి.జగదాంబ, ప్రధాన కార్యదర్శిగా కాజులూరు ఎంపీడీవో జె.రాంబాబు, జాయింట్ సెక్రటరీగా బి.హరికృష్ణ, కార్యదర్శులుగా ప్రత్తిపాడు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, సామర్లకోట ఎంపీడీవో కె.హిమమహేశ్వరి, మహిళా కార్యదర్శిగా కరప ఎంపీడీవో కె.స్వప్న, కోశాధికారిగా డ్వామా డీఎల్డీవో పి.భాస్కర్ ఎన్నికయ్యారు.

విషమ పరీక్ష



ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

- టెన్త్ విద్యార్థులతో కూటమి సర్కార్ చెలగాటం
- పీడీఎఫ్ రూపంలో స్టడీ మెటీరియల్ అందజేత
- ప్రింటింగ్ చేయించుకోవాలని సూచన
- తల్లిదండ్రులకు వదిలిపోతున్న చేతిచమురు
- జిల్లా విద్యార్థులపై రూ.2.75 కోట్ల భారం

విద్యాభివృద్ధికి తోడ్పడే తల్లికి వందనం (గతంలో అమ్మ ఒడి), ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలకు ఇప్పటికే మంగళం పాడిన కూటమి ప్రభుత్వం.. చివరకు టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇవ్వడంలోనూ మొండిచేయి చూపుతోంది. 'చదువుకోవాలనుకుంటే మీ డబ్బుతో మీరే ప్రింట్లు తీయించుకోండి' అంటూ విద్యార్థులకు ప్రింట్ డాక్యుమెంట్ ఫార్మాట్ (పీడీఎఫ్) ఫైల్స్ మాత్రమే ఆయా పాఠశాలల ద్వారా అందిస్తోంది. దీంతో, వాటిని ప్రింట్ తీయించుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులకు చేతిచమురు వదిలిపోతోంది.

పిఠాపురం: ఉన్నత విద్యాభ్యాసానికి కీలకమైన 10వ తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి. అందువలన ఈ పరీక్షలకు విద్యార్థులను అన్నివిధాలా సంసిద్ధుల్ని చేయడానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి. వచ్చే నెల 17 నుంచి 31వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో విద్యా శాఖ అధికారులు ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రణాళికను విద్యా శాఖ రూపొందించింది. దీని ప్రకారం చదువులో వెనుకబడిన విద్యార్థులకు అదనంగా క్లాసులు చెబుతూ, సబ్జెక్టు నిపుణులతో ప్రత్యేకంగా తయారు చేయించిన స్టడీ మెటీరియల్‌ను అందించాలి. అయితే ఇంతవరకూ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. స్టడీ మెటీరియల్ ఇచ్చేందుకు తమ వద్ద నిధులు లేవంటూ ఆ భారాన్ని విద్యార్థుల పైనే మోపుతోంది. వంద రోజుల ప్రణాళికలో ఇప్పటికే 60 రోజులు పూర్తయిపోయాయి. మరోవైపు టెన్త్ పబ్లిక్ పరీక్షలకు మరో 38 రోజులు మాత్రమే వ్యవధి ఉంది. గడువు దగ్గర పడుతున్నప్పటికీ ప్రభుత్వం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ మాత్రం అందించలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతి ఏటా అక్టోబర్ నెలలోనే స్టడీ మెటీరియల్ పంపిణీ చేసేవారు. ఈసారి కూటమి ప్రభుత్వం స్టడీ మెటీరియల్ పంపిణీలో చేతులెత్తేసింది.

ప్రతిపాదనలు పంపించాం



పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇవ్వాలని ప్రతిపాదనలు పంపించాం. త్వరలో ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటాం.

– పి.రమేష్, జిల్లా విద్యా శాఖాధికారి, కాకినాడ

విద్యార్థులపైనే భారం

రాష్ట్ర విద్యా శాఖ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను పీడీఎఫ్ ఫైల్ రూపంలో పాఠశాలలకు పంపించారు. ఇది అన్ని సబ్జెక్టులకూ కలిపి 500 పేజీల వరకూ ఉంది. ఒక్కో పేపర్ ప్రింటింగ్‌కు జిరాక్స్ షాపుల్లో రూ.2 ఖర్చవుతోంది. ఈ లెక్కన 500 పేజీల స్టడీ మెటీరియల్ ప్రింటింగ్‌కు రూ.1,000 వరకూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఖర్చవుతోంది. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 27,498 మంది ఉండగా.. వీరందరిపై ప్రింటింగ్ ఖర్చుల భారం సుమారు రూ.2.75 కోట్లు పడుతోంది. ఒకేసారి ఇంత ఖర్చు భరించలేక పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో, సకాలంలో స్టడీ మెటీరియల్ చేతికి అందక.. పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలో అర్థం కాక విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు స్టడీ మెటీరియల్ చేతిలో లేకపోవడంతో విద్యార్థులను పరీక్షలకు ఏవిధంగా సిద్ధం చేయాలో అర్థం కావడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. తమ పాఠశాలకు స్టడీ మెటీరియల్ రాలేదని చెప్పడానికి కూడా వారు భయపడుతున్నారు. 'దయచేసి మమ్మల్ని వీధిలో పెట్టకండి. మేము చెప్పినట్లు తెలిస్తే మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తారు' అని చెబుతున్నారు.

జిల్లాలో పదో తరగతి విద్యార్థుల వివరాలు

పాఠశాలలు	457
పరీక్ష కేంద్రాలు	142
పరీక్షలు రాయనున్న బాలికలు	13,735
బాలురు	13,763
మొత్తం	27,498
ఒక్కో విద్యార్థికి స్టడీ మెటీరియల్ ప్రింటింగ్ ఖర్చు	రూ.1,000
జిల్లా వ్యాప్తంగా విద్యార్థులపై భారం	రూ.2.75 కోట్లు

విద్యార్థులపై భారాలు దారుణం



కూటమి ప్రభుత్వం ఈ ఏడాది స్టడీ మెటీరియల్ ఇవ్వకుండా విద్యార్థులపై ఆర్థిక భారం మోపడం దారుణం. ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేయడానికే అన్నట్టుగా సర్కారు ధోరణి ఉంది. ఇలాగైతే మెరుగైన ఫలితాలు ఎలా వస్తాయి? ఉచిత చదువులు అంటూ డబ్బులు పెట్టి కొనుక్కోవాల్సిన పరిస్థితి తీసుకురావడం సిగ్గుచేటు. ఇప్పటికైనా స్టడీ మెటీరియల్ పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ

భీష్మ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

- పలుచోట్ల షామియానాలు, అదనపు కౌంటర్లు
- పశ్చిమ రాజగోపురం వద్ద కంపార్టుమెంట్లు
- భక్తులకు మంచినీరు అందించేందుకు ఏర్పాట్లు



పశ్చిమ రాజగోపురం వద్ద వేసిన షామియానాలు

అన్నవరం: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని సన్నిధికి శనివారం వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో భక్తులకు నీడ కల్పించేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పశ్చిమ రాజగోపురం ఎదురుగా ప్లాట్‌ఫామ్‌పై, భక్తులు బస్సుల కోసం వేచి ఉండే పార్కింగ్ స్థలంలో షామియానాలు వేశారు. అలాగే, భక్తుల కోసం అదనపు క్యూ లైన్లు, ప్రసాదం, వ్రతాలు, దర్శనం టిక్కెట్లు విక్రయించేందుకు అదనపు బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పలుచోట్ల మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నారు. ఈసారి భీష్మ ఏకాదశి, రెండో శనివారం సెలవు రోజున వచ్చినందున సత్యదేవుని సన్నిధికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పశ్చిమ రాజగోపురం వద్ద భక్తుల కోసం కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులను ఈ కంపార్ట్‌మెంట్లలో ఉంచి తోపులాట లేకుండా దర్శనానికి పంపించనున్నారు. ఈ కంపార్ట్‌మెంట్లలో భక్తులకు మంచినీరు, చిన్నారులకు పాలు, బిస్కెట్లు కూడా పంపిణీ చేయనున్నారు. శుక్రవారం రాత్రి నుంచే భక్తులు రత్నగిరికి చేరుకుంటారు. అప్పటి నుంచి భక్తులకు ఎటువంటి ఇబ్బందీ రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి సత్యదేవుని వ్రతాలు నిర్వహిస్తారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. భక్తులకు శనివారం ఉదయం 8 గంటల నుంచి పులిహోర, దద్దోజనం పంపిణీ చేయనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఈఓ

రత్నగిరిపై భీష్మ ఏకాదశి ఏర్పాట్లను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు బుధవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. గత కార్తిక మాసంలో మాదిరిగానే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని, భక్తుల నుంచి విమర్శలు లేకుండా సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు, ఈఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాలువ పనులు అడ్డుకున్న నిర్వాసితులు



పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను అడ్డుకున్న కుమ్మరిలోవ కాలనీ నిర్వాసితులు, రైతులు

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ కాలనీ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థ సిబ్బందిని కాలనీ నిర్వాసితులు అడ్డుకున్నారు. తహసీల్దార్ ప్రసాద్, రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ సంస్థ ఆర్‌వీఆర్ సిబ్బంది బుధవారం జేసీబీతో ఆ ప్రాంతానికి వెళ్లారు. పనులు చేస్తుండగా కాలనీ నిర్వాసితులు, భూ నిర్వాసితులు వారిని అడ్డుకున్నారు. నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని, అప్పటి వరకూ వద్దని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా కొనసాగుతున్న తమ సమస్య పరిష్కరించకుండా కాలువ పనులు చేయనివ్వబోమని స్పష్టం చేశారు. చట్ట ప్రకారం చెల్లింపులు పూర్తయిన చోటే పనులు చేపడుతున్నామని తహసీల్దార్, కాంట్రాక్ట్ సిబ్బంది చెప్పారు. తాము కోర్టు నుంచి స్టే పొందామని కొంతమంది రైతులు, కాలనీలోని ఇళ్ల నిర్వాసితులు పేర్కొన్నారు. అటువంటి పత్రాలుంటే రేపటిలోగా ఇవ్వాలని తహసీల్దార్ సూచించారు. కాలనీలో ఇళ్లు కోల్పోతున్న 165 కుటుంబాలకు, 40 ఎకరాల రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని నిర్వాసితులు తెలిపారు. ఇళ్లు కోల్పోతూండటంతో 15 ఏళ్లుగా మరమ్మతులు చేయించకుండానే బిక్కుబిక్కుమంటూ నివాసం ఉంటున్నామని, ఈ దశలో పనులు చేస్తే ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే, పోలవరం ఎడమ ప్రధాన కాలువ తవ్వకం పనులు చేపట్టలేదని, జంగిల్ క్లియరెన్స్ మాత్రమే చేస్తున్నామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. దీనివల్ల ఇళ్లు కూలిపోయే అవకాశం ఉండదన్నారు. కోర్టు నుంచి ఎటువంటి పత్రాలున్నా తమకు చూపించాలని, పనులు అడ్డుకోవడం సరికాదని అన్నారు.

ఇంటర్‌లో నూరు శాతం ఉత్తీర్ణత

- అధ్యాపకులకు కలెక్టర్ ఆదేశం
- ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష



జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఇంటర్మీడియెట్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. జిల్లాలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రీ ఫైనల్ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా రానున్న 25 రోజులూ జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులపై అధ్యాపకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వారిని కేటగిరీలుగా విభజించి, చదివించాలన్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై మరింత దృష్టి పెట్టి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. తరగతులకు సెల్‌ఫోన్లు తీసుకువచ్చే విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఐఈవో జీజీకే నూకరాజు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల హాజరు పెంచాలి

రానున్న 45 రోజుల పాటు జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా నిర్వహించాలని, కూలీల హాజరు పెంచాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. డ్వామా, పంచాయతీరాజ్ అధికారులు, ఎంపీడీవోలతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులన్నింటినీ మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ఏలేశ్వరం మండలంలో ఈ వారం కూలీల హాజరు బాగుందని ప్రశంసించారు. ఉపాధి పనుల అవసరం, అవకాశం ఎక్కువగా ఉన్న కోటనందూరు మండలంలో ఆశించిన ప్రగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

రెడ్‌క్రాస్ సభ్యత్వాలు, విరాళాలు పెంచాలి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాలు, విరాళాల సేకరణ, సేవ కార్యక్రమాలను పెద్ద స్థాయిలో చేపట్టాలని అధికారులకు కలెక్టర్ షణ్మోహన్ విజ్ఞప్తి చేశారు. రూ.లక్ష విరాళాలు సేకరించిన వారిని వెండి పతకంతో, రూ.2 లక్షలు ఆపై విరాళాలు సేకరించిన వారిని గోల్డ్ మెడల్‌తో రెడ్‌క్రాస్ సొసైటీ సత్కరిస్తుందని తెలిపారు.

పక్కాగా శివరాత్రి ఏర్పాట్లు

ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా శైవక్షేత్రాల్లో పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. భక్తులకు రవాణా, తాగునీరు, సురక్షిత స్నానఘట్టాలు, దుస్తులు మార్చుకునేందుకు రూములు, మరుగుదొడ్లు, బారికేడింగ్, లైటింగ్, సూచనలు ఇచ్చేందుకు, తప్పిపోయిన వారి జాడ తెలిపేందుకు మైక్ సిస్టమ్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ ఏవీఎస్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి ప్రసాద్ బాబు, ఎంపీడీవోలు, ఏపీడీలు, పంచాయతీరాజ్ ఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

10న నులిపురుగుల నివారణ కార్యక్రమం

నులిపురుగుల నివారణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10న 19 ఏళ్లలోపు విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. నులిపురుగుల నివారణ కార్యక్రమం వాల్‌పోస్టర్లు, కరపత్రాలను కలెక్టరేట్‌లో బుధవారం ఆయన ఆవిష్కరించారు.

గరుడ గమనా.. పుష్పక వాహనా..

- లక్ష్మీ సమేతుడై ఊరేగిన నారసింహుడు
- తన్మయంతో దర్శించిన భక్తజనం
- ఏర్పాట్లు చేసిన అధికారులు



విద్యుద్దీపాలంకరణలతో ఆకట్టుకుంటున్న ప్రధాన, ఉపాలయాలు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో కొలువైన లక్ష్మీ నృసింహస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం గరుడ పుష్పక వాహనంపైన, రాత్రి పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నిత్యం తనను సేవించే గరుడ వాహనంపై అధిరోహించడమే గరుడ వాహన సేవలోని పరమార్థం. అలాగే తన హృదయ మనే పుష్పకంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటేందుకు స్వామివారు పుష్పక వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ఇది పుష్పక వాహనం పరమార్థం. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఆలయ వ్యవస్థాపక అనువంశిక సభ్యుడు రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ప్రముఖులు, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గరుడ, పుష్పక వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

విద్యుత్కాంతులతో దేవతామూర్తుల ఫ్లెక్సీలు

లక్ష్మీ నృసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ఫ్లెక్సీలు భక్తులను ఎంతోగానో ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు పశ్చిమ రాజగోపురం, ప్రధాన, ఉపాలయాల గోపురాలు విద్యుల్లతలతో శోభిల్లుతున్నాయి.

అంతర్వేదిలో నేడు..

ఉత్సవాల్లో భాగంగా గురువారం మూడో రోజు ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ స్వామివారి తిరువారాధన, బాలభోగం, ఆర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ సుదర్శన హోమం, సాయంత్రం 4 గంటలకు హంసవాహనంపై, 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ధ్వజారోహణ. రాత్రి 8 గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవాలను నిర్వహించనున్నారు.



ఐజీ అశోక్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

స్వామివారి సన్నిధిలో ఏలూరు రేంజి ఐజీ

అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని పి.విజయ సారధి అందజేశారు. ఆయన వెంట కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీ మోహన్, రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో ఏర్పాట్ల పరిశీలన

అంతర్వేది ఉత్సవాలను పురస్కరించుకుని ఐజీ అశోక్ కుమార్ అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. 7వ తేదీన నిర్వహించే స్వామివారి కల్యాణ వేదక వద్ద, వేదిక ఇరువైపులా ఉన్న భారీ షెడ్లలో గ్యాలరీల ఏర్పాట్లపై ఆలయ సూపరింటెండెంట్ విజయ సారధి ఐజీకి వివరించారు. 8న రథోత్సవం, 12న పౌర్ణమి సముద్ర స్నానాల ఏర్పాట్లను సైతం ఐజీ సమీక్షించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 – 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

8న పుట్టకొండ లక్ష్మీ నరసింహుని కల్యాణం

పెదపూడి: శతాబ్దాల చరిత్ర కలిగిన పెదపూడి మండలం పుట్టకొండ లక్ష్మీ నరసింహస్వామి దివ్య కల్యాణం ఈ నెల 8న ఘనంగా నిర్వహించనున్నారు. స్వామివారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈఓ వద్దాది సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపక సభ్యుడు పి.అనంతాచార్యులు తెలిపారు. 8న భీష్మ ఏకాదశి శనివారం రాత్రి తెల్లవారు జామున 4 గంటలకు అనగా (ఆదివారం) స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం తొమ్మిదో తేదీన నిత్యహోమం, బలిహరణ, పదిన గజవాహన సేవ, 11న అశ్వవాహన సేవ, 12న పూర్ణాహుతి, చక్రతీర్థం, 13న శ్రీ పుష్పయాగం, ద్వాదశ అర్చనలతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.



ప్రత్యేక అలంకరణలో కల్యాణ మూర్తులు లక్ష్మీ నరసింహస్వామి, గోదాదేవి, వేంకటేశ్వరస్వామి



పుట్టకొండ గ్రామంలోని స్వామి వారి ఆలయం

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫాం చివర ఒక వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మంగళవారం రాత్రి పట్టాలు దాటుతుండగా విజయవాడ వైపు వెళ్తున్న రైలు ఢీ కొట్టడంతో అతడు మృతి చెందాడని, అతని శరీరం నుజ్జునుజ్జయ్యిందని తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుని వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని, సిమెంట్ రంగు జీన్ ప్యాంటు, నలుపు షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి మోచేయి పై సిరి అని ఇంగ్లీషులో పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడి శరీర భాగాలను తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే పోలీస్ స్టేషన్ 94906 19020 నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో వృద్ధుడు..



రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ 4–5 లలో సుమారు 70 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై లోవరాజు బుధవారం తెలిపారు. మృతదేహాన్ని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు ఆకుపచ్చ రంగు స్వెట్టర్, బూడిద రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని గురించి ఏదైనా సమాచారం ఉంటే 94406 27551, 94914 44022 నంబర్లకు తెలియజేయాలన్నారు.

అలసిన మనసుకు సాంత్వన కళ

- ప్రముఖ కవి జొన్నవిత్తుల
- చిత్తు కాగితాలతో చిత్తరువుల రూపకల్పన
- శ్రీప్రకాష్‌లో ఆకట్టుకున్న 'హరివిల్లు'

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మానవ జీవితంలో కళ అత్యుత్తమమైనదని, అది అలసిన మనసుకు ప్రశాంతతను ఇస్తుందని సుప్రసిద్ధ కవి, సినీ గేయ రచయిత, తెలుగు అధికార భాషా సంఘ మాజీ సభ్యుడు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సురేష్‌నగర్‌లో శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో 'హరివిల్లు–2025' ఆర్ట్ ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థులలో నిద్రాణమై ఉన్న శక్తిని వెలికి తీసి, సమాజానికి ఒక అద్భుతమైన సందేశాన్ని ఇచ్చేలా కళాకృతులు ఉన్నాయన్నారు. గౌరవ అతిథి భారతీయ చిత్రకారిణి, ప్రింట్ మేకర్ గౌరి వేముల మాట్లాడుతూ కళ అనేది తపస్సు అని, కళాకారుడు ఒక ఋషీశ్వరుడని అన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ విజయప్రకాష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. గ్రంధి రాజగోపాల్, ఆల్ ఈజ్ వెల్ వ్యవస్థాపకుడు కిశోర్‌కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్రాలు, కళారూపాలను అతిథులకు వివరిస్తున్న చిన్నారి

చెత్త తగలబెడుతుండగా పేలుడు

ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులకు గాయాలు

కాకినాడ రూరల్: వేకువ జామునే విధులకు వెళ్లిన రమణయ్యపేట పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తగలపెడుతుండగా ఒక్కసారిగా వచ్చిన పేలుడుతో తీవ్రంగా గాయపడ్డారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ వద్ద రెండు రోజుల క్రితం చెత్తను తగలబెడుతుండగా సమీపంలోని ఇంటి వారు చెత్తతో ఉన్న కవర్‌ను పారిశుద్ధ్య కార్మికులకు అందజేయడంతో దానిని చెత్త మంటలో వేయగా కొద్ది సేపటికి పెద్ద శబ్దంతో పేలి మంటలు వ్యాపించాయి. దీంతో అక్కడే ఉన్న ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులు కోమాటి లక్ష్మి, కాకినాడ పోచమ్మ, ధనాల గణేష్ గాయపడ్డారు. పోచమ్మ ఒంటిపై కాలిన గాయాలు తీవ్రం కావడంతో జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. మిగిలిన ఇద్దరు చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారు. కవర్‌లో ఉన్న బాడీ స్ప్రే సీసాలే పేలుడుకు కారణమని భావిస్తున్నారు.

స్కూలు బస్సు ఢీకొని చిన్నారి మృతి

తొండంగి: మండలంలోని సీతారాంపురం గ్రామంలో బుధవారం స్కూలు బస్సు ఢీకొని మూడేళ్ల పాప మృత్యువాతపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తునికి చెందిన ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల బస్సు విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తుండగా సీతారాంపురంలో మూడేళ్ల పాప శివకోటి సుకన్య (3)ను బస్సు ఢీకొట్టింది. దీంతో ఆ చిన్నారి అక్కడికక్కడే మృత్యువాతపడింది. దీంతో చిన్నారి తండ్రి శివకోటి సింహాద్రి అప్పన్న ఇతర కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై దళిత సంఘాల నాయకులు కొల్లా బత్తుల దిలీప్, శివకోటి అప్పారావు, జట్టు చిన్నబాబు, అంబేద్కర్ యూత్ సభ్యులు ఆందోళన చేయడంతో ఇన్‌చార్జి ఎస్సై బి.కృష్ణమాచారి అక్కడికి చేరుకున్నారు. దీంతో స్కూలు యాజమాన్యం స్పందించి పాప కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. పాప తండ్రి అప్పన్న ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు.



శివకోటి సుకన్య (ఫైల్)



పాప మృతితో న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ప్రేమించి వంచించాడు.. పెళ్లంటే పొమ్మన్నాడు..

బాలుడిపై బాలిక ఫిర్యాదు

రాజానగరం: ప్రేమించానన్నాడు.. వంచించాడు.. పెళ్లి మాటెత్తితే కాదు పొమ్మన్నాడు. 16 ఏళ్ల బాలిక 18 బాలుడిపై ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం రాజానగరంలో జరిగిన ఈ సంఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలు ఇలా వున్నాయి. రాజానగరానికి చెందిన ఆ మైనర్లు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. నరేంద్రపురం కూడలిలో జులాయిగా తిరిగే ఆ బాలుడు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకునే రోజుల నుంచి ఆమె వెంటపడేవాడు. చివరకు తనతోనే లోకం అనేలా ఆమెకు మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. పదో తరగతి వరకు చదివిన ఆ బాలిక పెళ్లి చేసుకుందామని ఒత్తిడి చేయడంతో పెళ్లంటే తనకు ఇష్టం లేదని పొమ్మన్నాడు. దీనితో న్యాయం కోసం ఆ బాలిక స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఇద్దరూ మైనర్లే కావడంతో పోలీసులు పోక్సో కేసుగా నమోదు చేసి, నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎస్సై నారాయణమ్మ దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న 9 మంది అరెస్టు

రూ.77 వేల స్వాధీనం

అమలాపురం టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్న బృందంపై పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం రాత్రి దాడి చేశారు. 9 మంది జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.77,520 నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

తాళ్లపూడి: పలు చోరీ కేసుల్లో నింతుడిని అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దేవంలో జనవరి 30న ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసును ఐదు రోజుల్లో ఛేదించినట్టు ఎస్సై తెలిపారు. మలకపల్లి బస్టాండ్ వద్ద మంగళవారం గోపాలపురం మండలం బీమోలుకు చెందిన చుక్కల బాబిని నిందితుడుగా గుర్తించి అదుపులోకి తీసుకుని పోగొట్టుకున్న మంగళ సూత్రాలు, నల్లపూసలు, ఉంగరాలు, పట్టీలు, బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు పర్యవేక్షణలో సీసీఎస్ ఎస్సై రవీంద్రతో కలిసి కేసును ఛేదించి సొత్తును రికవరీ చేశారు. నిందితుడు బాబీని కోర్టులో హాజరు పరచినట్టు ఎస్సై తెలిపారు.



పోలీసులు రికవరీ చేసిన బంగారు ఆభరణాలు

చెడు వ్యసనాలకు బానిసై చోరీలు

- ముగ్గురు మైనర్లతో పాటు ఆరుగురి అరెస్టు
- 13 మోటార్ సైకిళ్ల స్వాధీనం
- అమలాపురం డీఎస్పీ ప్రసాద్

అమలాపురం రూరల్: చెడు వ్యసనాలకు బానిసలైన ముగ్గురు యువకులు మరో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని వారు దొంగిలించిన 13 మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోనసీమతో పాటు ఇతర జిల్లాల్లో మొటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న వారి వివరాలను డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం గంజాయి, మద్యం తదితర వ్యసనాలతో డబ్బుకోసం వారు ఈ చోరీలకు పాల్పడినట్టు తెలిపారు. కోనసీమలోని వివిధ పోలీస్ స్టేషన్‌తో పాటు విశాఖ జిల్లా పరిధిలోని కంచర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వారు దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వారి నుంచి రూ.8.82 లక్షల విలువైన 13 మోటార్ సైకిళ్లను, మూడు బ్యాటరీలను రికవరీ చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

నిందితులైన కాట్రేనికోన మండలం చెయ్యేరు గున్నేపల్లికి చెందిన మేకల వీర వెంకట శ్రీరామ్ మూర్తి, అమలాపురం మండలం ఈదరపల్లి చెందిన వీరమల్లు తరుణ్ శశికుమార్, ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన దొంగ లోకేష్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు. రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్ పర్యవేక్షణలో తాలూకా ఎస్సై వై.శేఖర్‌బాబు, క్రైమ్ ఏఎస్సై సుబ్బారావు, హెచ్‌సీ రవికుమార్, పీసీలు శివకుమార్, ధర్మరాజు నిందితులను పట్టుకోవడంలో శ్రమించారన్నారు. వారికి రివార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లను చూస్తున్న డీఎస్పీ ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్

రెండు వేర్వేరు హత్య కేసుల్లో తొమ్మిది మంది నిందితుల అరెస్టు

కాకినాడ క్రైం: గత నెల 30న కాకినాడ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న రెండు వేర్వేరు హత్య కేసుల్లో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసినట్టు బుధవారం పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్ తెలిపారు. అక్రమ సంబంధం నేపథ్యంలో చోటు చేసుకున్న గుడాల చంద్రశేఖర్ హత్య కేసులో లావణ్య, లోవరాజులు అరెస్టు కాగా అదే రోజు చోటు చేసుకున్న టి.అర్జునరావు హత్య ఘటనలో మద్యం తాగి దాడికి పాల్పడిన ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్టు సీఐ వివరించారు.